క్లుప్తంగా

రంజాన్ తోఫా అందజేత



రాజాపూర్: మండల కేంద్రంతో పాటు చెన్నవెల్లి, తిర్మలాపూర్, చొక్కంపేట్ తదితర గ్రామాల్లోని ముస్లింలకు ఎంపీటీసీ సభ్యుడు అభిమన్యురెడ్డి బుధవారం రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలు అభినందనీయమని తిరుమలాపూర్ మాజీ సర్పంచ్ రామకృష్ణగౌడ్ అన్నారు. అభిమన్యురెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వెంకట్ రాంరెడ్డి, శేఖర్‌రెడ్డి, నర్సింలు, ఆరీఫ్, బంగారి వెంకట్, తదితర్లు పాల్గొన్నారు.



భూత్పూర్: మున్సిపాలిటీలోని 4వ వార్డులో ముస్లింలకు కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్ బుధవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. రంజాన్ సందర్భంగా పప్పు, నూనె, బియ్యం తదితరాలు అందించినట్లు తెలిపారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు లాలూ నాయక్, తరుణ్, సాయికుమార్, ఎల్లప్ప, నాగరాజు, గౌస్, ఇమ్రాన్, బాలయ్య, పోషన్న, అంజి, రమేష్ తదితురులు ఉన్నారు.

అధికార ప్రతినిధిగా బాలవర్ధన్‌గౌడ్

జడ్చర్ల టౌన్: భారతీయ జనతాపార్టీ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అధికారప్రతినిధిగా జడ్చర్లకు చెందిన ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి బుధవారం నియామకపు పత్రం అందజేశారు. జిల్లాలో జరిగే రాజకీయ మార్పులు, సమీకరణల గురించి మాట్లాడేందుకు ఆయనను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలవర్ధన్‌గౌడ్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఇంకుగుంతలపై ఇంటింటి సర్వే



భూత్పూర్: మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో ఇంకుడు గుంతల నిర్మాణంపై మున్సిపల్ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. బుధవారం చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేందుకు కమిషనర్, ఏఈ, సిబ్బంది బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పూర్తి విధివిధానాలపై త్వరలో స్పష్టత రానున్నట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు.


నంబిరాజు రాజీనామా

పాలమూరు: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి నంబిరాజు రాజీనామా చేసి సదరు లేఖను బుధవారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డికి అందించారు. ఇటీవల నియామకం చేసిన నూతన కమిటీ సక్రమంగా చేయలేదని, దీనికితోడు పార్టీలో గ్రూప్ రాజకీయాలకు ప్రోత్సాహిస్తున్నారని అన్నారు. కేవలం ఒకరి వర్గమే ఉండాలనే ఉద్దేశ్యంతో సీనియర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల సమయంలో జిల్లా కమిటీని హడావుడిగా ఎన్నుకోవడం సరికాదని, జిల్లా కోర్ కమిటీతో చర్చించి ఆ తర్వాత నూతన కమిటీని ప్రకటించాలని అన్నారు. కానీ పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ప్రకటించారన్నారు.

శ్రీరామనవమి వరకు కందూరు జాతర

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద జాతర శ్రీరామ నవమి వరకు కొనసాగనుంది. గత నెల 21న మొదలైన స్వామి వారి బ్రహ్మోత్సవాలు అదే నెల 26న ముగిశాయి. అప్పటి నుంచి ఆలయం వద్ద ఉగాది వరకు జాతర కొనసాగింది. ఉగాది రోజు విశిష్ట పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఇదిలా ఉండగా ఏటా ఉగాది వరకే జాతర సాగేది. అయితే కొన్నేళ్ల నుంచి జాతరను శ్రీరామ నవమి వరకు పొడిగించారు. ఈసారి కూడా శ్రీరామ నవమి వరకు నిర్వహించనున్నట్లు ఈఓ రాజేశ్వరశర్మ తెలిపారు.

ముమ్మరంగా తనిఖీలు



భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో బుధవారం రాత్రి కేంద్ర బలగాల సహాయంతో భూత్పూర్ ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఎంపీ ఎన్నికల దృష్ట్యా వాహనాల్లో నగదు, నగదేతర వస్తువులు రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. చౌరస్తాలో జిల్లా కేంద్రం, హైదరాబాద్ నుంచి వచ్చే, పోవు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు వివరించారు.

కనులపండువగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథంపై అలంకరణలో వరదరాజుల స్వామివారు

మహబూబ్‌నగర్ రూరల్: కోడూర్‌లో బుధవారం వరదరాజులస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కాంచీపురంలో వెలసిన వరదరాజుల స్వామి సుమారు ఐదువేల సంవత్సరాల కిందట చోళుల రాజధాని అయిన ప్రస్తుత కోడూర్‌లో ప్రతిష్ఠితమయ్యారు. ఆనాటి నుంచి ఆనవాయితీగా ఉగాది పర్వదినాన గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా శ్రీ వరదరాజులస్వామి ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి.

బుధవారం తెల్లవారుజామున రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవాల్లో భాగంగా ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భగుడి నుంచి సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య ప్రధాన ద్వారం వెంట దేవస్థానం ఆవరణలోని రథం వద్దకు ఊరేగింపుగా స్వామివారిని తీసుకువచ్చారు. వివిధ రకాల పూలు, విద్యుత్ బల్బులు, మామిడి తోరణాలతో ముస్తాబుచేసిన రథంపై స్వామివారిని ఉంచి రథోత్సవం నిర్వహించారు. హరినామస్మరణ మధ్య రథం ముందుకు కదిలింది. భక్తులు స్వామివారి రథాన్ని లాగి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. అనంతరం బిందె సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉగాది పర్వదిన మరుసటి రోజు హోలీ పండుగను ఎలాంటి తరతమ భేదాలు లేకుండా గ్రామస్తులు ఒకరికొకరు రంగులు చల్లుకుని ఆటలు ఆడుకున్నారు. సాయంత్రం స్వామివారి దేవాలయం చుట్టూ ఎద్దుల బండ్ల ఊరేగింపు సైతం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు రాజుగౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్, కాంగ్రెస్ నాయకులు కుర్మయ్య, కథల్ పాల్గొన్నారు.

వెయ్యేళ్ల చరిత్ర

ఒకప్పుడు జిల్లాలోని కందూరు, కోడూరు గ్రామాలు చోళుల రాజధానులుగా ఉండేవని చరిత్ర చెబుతోంది. ఆ కాలంలో ధనాగారం కూడా కోడూర్‌లోనే ఉండేదని, పురావస్తు శాఖ పరిశోధకులు ప్లచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ శివనాగిరెడ్డి తేల్చారని గ్రామ పెద్దలు చెబుతున్నారు.



హోలీ వేడుకలో యువకుల కోలాహలం



స్వామివారి పల్లకీసేవ

వైభవంగా లక్ష్మీనారసింహుడి కల్యాణం

మహమ్మదాబాద్: ఉగాది పురస్కరించుకుని మహమ్మదాబాద్ మండల కేంద్రంలో లక్ష్మీ నారసింహుడి కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయం ఆవరణలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వేడుక కనుల పండువగా సాగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. అర్చకులు రమేశ్, శర్మ, రామచంద్రయ్య, కమిటీ సభ్యులు రాములు, బాల్‌రాజ్, రామన్న, కృష్ణయ్య, నారాయణ, బచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



కుష్టు నిర్మూలనకు కృషిచేద్దాం



శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి జరీనా భేగం

నవాబుపేట: కుష్టు రహిత భారత్ లక్ష్యంగా కొనసాగుతున్న కార్యక్రమాల్లో అందరు పాల్గొనాలని జిల్లా లెప్రసీ ప్రోగ్రాం అధికారి జరీనాబేగం పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో లెప్రసీ ప్రత్యేక శిబిరాన్ని ఆమె పరిశీలించి సూచనలు చేశారు. వారం రోజుల పాటు జరిగే స్పెషల్ డ్రైవ్‌లో అందరు పాల్గొనాలని.. కుష్టు నిర్మూలనకు కృషిచేద్దామని అన్నారు. మండలంలో 13,915 ఇళ్లలో సర్వే నిర్వహించి 58,945 మందిని పరీక్షించినట్లు వివరించారు. కాగా 193 మందికి స్వల్ప లక్షణాలు ఉన్నట్లు గుర్తించి వారికి ప్రత్యేక పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. మండల వైద్యాధికారి నవీన్‌చంద్ర, శ్రీనివాస్‌రావు, హన్మంత్‌రావు, నర్సింహరెడ్డి, శరభలింగం, కమలమ్మ, శ్రీనివాస్, మమత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



మిడ్జిల్: కొత్తపల్లి ఎంపీటీసీ సభ్యుడు శంకరయ్య, అయ్యవారిపల్లి మాజీ సర్పంచ్ నర్సింహరెడ్డితో పాటు 50 మంది వివిధ పార్టీల కార్యకర్తలు బుధవారం ఎంపీ అభ్యర్థి డీకె అరుణ సమక్షంలో జిల్లాకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీలో చేరారు. మండల ఇన్‌చార్జ్ జనార్దన్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి రవీందర్‌గౌడ్

అడ్డాకుల: మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రవీందర్‌గౌడ్ బుధవారం బీజేపీలో చేరారు. మహబూబ్‌నగర్‌లో పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ, పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రవీందర్‌గౌడ్‌తో పాటు బీఆర్‌ఎస్‌కు చెందిన శ్రీనివాస్, కాంగ్రెస్‌కు చెందిన నర్సింహ బీజేపీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బుచ్చన్న యాదవ్, నాయకులు అరవింద్‌రెడ్డి, గట్టు మల్లేష్, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వంశీచంద్‌రెడ్డిని గెలిపించుకుందాం



టోర్నీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

బాలానగర్: ఎంపీ అభ్యర్థి వంశీచందర్ రెడ్డిని గెలిపించి పాలమూర్ జిల్లాను ఉత్తమంగా తీర్చిదిద్దుకుందామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. బుధవారం పెద్దరేవల్లిలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు ఆదిరమణా రెడ్డి, సోంమ్లానాయక్, హతిరాం నాయక్, వెంకటేశ్వర్ రెడ్డి, విష్ణు, వెంకట్‌రాం నాయక్, రాఘవేందర్ గౌడ్, అమర్ సింగ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి ఎంపీటీసీ సభ్యుడు

ఉడిత్యాల ఎంపీటీసీ సభ్యుడు ప్రదీప్ గౌడ్ బుధవారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రంగారెడ్డి గూడ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డితోపాటు పలువురి నాయకుల సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్, వెంకటేశ్వర్ రెడ్డి రవి ఉన్నారు.

ఇష్టపడి చదవాలి



రాజాపూర్: విద్యార్థులు ఇష్టపడి చదివితే లక్ష్యాన్ని సులభంగా సాధించగలుగుతారని మల్లేపల్లి ఆలయ కోశాధికారి అల్వాలశ్రీశైలం పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో 180 మంది విద్యార్థులకు పసులాధి లింగారెడ్డి తల్లిదండ్రులు భారతమ్మ, చెన్నరెడ్డి జ్ఞాపకార్థం పరీక్ష ప్యాడ్‌లు, బిస్కెట్‌ప్యాకెట్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. అదేవిధంగా పాఠశాలకు సీసీ కెమెరాలు, ప్రింటర్‌కు సహకారం అందించాలని ప్రిన్సిపాల్ పావని కోరగా సానుకూలంగా స్పందించారు. దండు శ్రీశైలం, నారాయణరెడ్డి, శ్రీనివాస్, చెన్నారెడ్డి, బాలస్వామి, నాగరాజ్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఉండరాదు



మిడ్జిల్: వేసవి కాలంను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జేడీఏ వెంకటేష్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాలలో నీటి ఇబ్బంది ఉన్న దగ్గర, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, ఎండలను దృష్టిలో ఉంచుకోని ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు, తాగునీరు, టెంట్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేట: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని డీఎల్‌పీఓ పండరీనాథ్ సూచించారు. బుధవారం ఇప్పటూర్, చౌటపల్లి గ్రామాలను ఆయన మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఈఓపీఆర్‌డీ బద్రునాయక్, ఏఈ సమీయుల్లా, కల్పన తదితరులు ఉన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

గండేడ్: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని గండేడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం వెన్నాచేడ్ సబ్‌సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. అక్కడికి వచ్చిన గర్భిణులతో, రోగులతో మాట్లాడారు. వారి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సరైన సమయంలో వ్యాక్సిన్‌లు ఇస్తున్నారా, వారు సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నారా అంటూ ఆరాతీశారు. అనంతరం సబ్‌సెంటర్‌కు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా మండుతున్నాయని వడదెబ్బ బారిన పడకుండా ఉండేలా ప్రజలకు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. ఎప్పుడు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఉపాధిహామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు. ప్రజలకు అవసరమైన వారికి ఓఆర్‌ఎస్ అందించాలన్నారు. సబ్‌సెంటర్‌కు వచ్చే వారికి సకాలంలో సరైన సేవలు అందించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఆశ వర్కర్లు కూడ నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం లింగాయిపల్లిలో వ్యాక్సినేషన్ పరిశీలించారు. ఆయన వెంట సీహెచ్‌ఓ రాములు, హెల్త్ అసిస్టెంట్ గోపాల్, సుగుణ ఏఎన్ఎం తదితరులు ఉన్నారు.



‘ఉపాధి’ వినియోగించుకోవాలి



మహమ్మదాబాద్: ప్రభుత్వం నిరుపేద కూలీలకోసం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గాధిర్యాల్ కార్యదర్శి హాజీ తెలిపారు. బుధవారం ఉపాధి పనులను పరిశీలించారు. గ్రామంలో మొత్తం 250 మంది వరకు కూలీలు పనులకోసం దరఖాస్తులు పెట్టుకోగా 225మందివరకు పనిచేస్తున్నారని వివరించారు. గతంలో ఉపాధి కూలీలు దినసరి వేతనం రూ.272 ఉండగా ఇటీవల రూ. 300లకు పెంచిందన్నారు. వేరే ఉపాధిలేని సమయంలో ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆయన సూచించారు. అందుకు పని ప్రదేశంలో కూలీలకు ఎప్పటికప్పుడు తగిన సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈయన వెంట క్షేత్రసహాయకుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, మేటీలు కృష్ణ, బుగ్గయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

బోర్లను మూయించిన అధికారులు



జానంపల్లి వద్ద మూసివేసిన బోరు



గాధిర్యాల్‌లో తాత్కాలికంగా ముళ్లకంచె

సాక్షి ఎఫెక్ట్..

గండేడ్/మహమ్మదాబాద్: సాక్షి దినపత్రికలో బుధవారం ‘పొంచి ఉన్న ముప్పు’ శీర్షిక వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. వివరాల్లోకి వెళ్తే.. గాధిర్యాల్, జానంపల్లి తదితర గ్రామాల్లో బోర్లు వేసి నీళ్లు లేక అలాగే వదిలేశారు. ఎలాంటి కప్పు పెట్టకుండా ఉండడంతో అవి ప్రమాదకరంగా మారాయి. ఇటీవల పంటపొలాలు ఎండుతున్న తరుణంలో కొత్తగా బోర్లను డ్రిల్లింగ్ చేస్తున్నారు. నీళ్లు పడకపోయే సరికి వాటిని వదిలేస్తున్నారు. దీంతో విషయాన్ని సాక్షి వెలుగులోకి తీసుకువచ్చింది. కాగా స్పందించిన ఎంపీడీఓ దేవన్న, తహసీల్దార్ నాగలక్ష్మి వాటిని మూసివేయించడంలో నిమగ్నమయ్యారు. గండేడ్ మండలం జానంపల్లి వద్ద తాగునీటికి సంబంధించిన బోరు అలాగే వదిలేయగా.. ఎంపీడీఓ దేవన్న పంచాయతీ కార్యదర్శిని ఆదేశించడంతో వెంటనే మూయించారు. అదేవిధంగా గాధిర్యాల్‌లో పంచాయతీ కార్యదర్శి హాజీ , ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డిలు కలిసి ప్రమాదకరంగా వదిలేసిన బోర్లను గుర్తించి మూయించారు. పొలాల్లో నిరుపయోగంగా ప్రమాదకరంగా ఉన్నా.. రైతులు పూడ్చివేసుకోవాలని సూచించారు.

దుమ్ము లేవకుండా చర్యలు



ట్యాంకర్‌తో నీళ్లు పోస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

జడ్చర్ల టౌన్: సిగ్నల్‌గడ్డలో ‘దుమ్మూ ధూళితో ఇబ్బందులు’ శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పందించారు. దుమ్ములేవకుండా ట్యాంకర్లతో నీటిని కొట్టించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు రోజుకు 3 పూటలా రోడ్డు పనులు కొనసాగుతున్న ఎల్ఐసీ కార్యాలయం నుంచి డిగ్రీ కళాశాల వరకు ట్యాంకర్‌తో నీటిని వదులుతున్నారు. దీంతో కొంత దుమ్ము తీవ్రత తగ్గింది. అయితే రాత్రిళ్లు సైతం నీటిని వదలాలని స్థానికులు కోరుతున్నారు.

మైసమ్మ విగ్రహం తరలింపు

జడ్చర్ల టౌన్: రోడ్డు విస్తరణలో భాగంగా సిగ్నల్‌గడ్డ పెద్దట్యాంక్ వద్ద ఉన్న మైసమ్మ విగ్రహాన్ని బుధవారం తరలించారు. కాగా అంతకుముందు లైట్ మోటర్ వెహికల్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిశంకర్, సభ్యులు, వార్డుకౌన్సిలర్ సతీష్ తదితరులు అమ్మవారికి పూజలు చేశారు. విగ్రహాన్ని సమీపంలోని సకతల దేవతల ఆలయంలో భద్రపర్చారు. రోడ్డు పనులు పూర్తయ్యాక తిరిగి ఆలయ నిర్మాణం చేసి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. కాగా ఆలయం తొలగించాల్సి వచ్చినందుకు జాతీయ రహదారుల శాఖ నుంచి రూ.2లక్షల పరిహారాన్ని విడుదల చేశారు.



పూజలు చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కేజీబీవీ విద్యార్థులకు కంటి పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

భూత్పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డా. అబ్దుల్ రబ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాలో బాలికలకు కంటి పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు ఆహారపు అలవాటులో మార్పు రావాలని, పోషక విలువలు ఉన్న ఆకుకూరలు అధికంగా తీసుకోవాలని అన్నారు. 132 మంది కంటి పరీక్షలు చేయగా 20 మందికి కంటి అద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డా.ఫయాజ్ హీజీర, జయ కుమారి, కేజీబీవీ ప్రత్యేక అధికారి ప్రశాంతి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఫార్మసిస్టు ప్రవలిక, 9వ వార్డు ఆఫీసర్ బీచుపల్లి, ఏఎన్ఎం మేరీ, శ్యామల, వెంకట నర్సమ్మ తదితరులు ఉన్నారు.

బాలాజీ నగర్‌లో సెల్‌టవర్ వద్దు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్ కాలనీలో సెల్ టవర్‌ను ఏర్పాటు చేయనియొద్దని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. టవర్ ఆరోగ్య సంబంధ సమస్యలు తలెత్తే ప్రమాదముందన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. అదేవిధంగా కాలనీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి సుదీర్‌గౌడ్, కాలనీ వాసులు ఆలూరిచెన్నయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్ పట్టివేత

చిన్నచింతకుంట: పల్లమర్రికి చెందిన మోహన్ గ్రామ సమీపంలోని ఊకచెట్టు వాగునుంచి బుధవారం ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్ శేఖర్ తెలిపారు. ఎవరైన అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం

నారాయణపేట రూరల్ : పట్టణంలోని చౌక్ సెంటర్‌లో ఇటీవల ఏర్పాటుచేసిన చలివేంద్రంలో బుధవారం మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1981–83 బ్యాచ్‌లో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గత కొద్ది సంవత్సరాలుగా వేసవిలో చలివేంద్రం నిర్వహిస్తున్నారు. అయితే ప్రతీ బుధవారం సంత రోజు కావడంతో జనాలు ఎక్కువగా వస్తుండటంతో వారి సౌకర్యార్థం మజ్జిగను అందించాలని ఆర్టీసీ డీఎం లక్ష్మిసుధా చేతుల మీదుగా ప్రారంభించారు.